క్లుప్తంగా

గంగాదేవికి ప్రత్యేక పూజలు



చెరువు వద్ద పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల చెరువు భారీ వర్షాలతో నిండి కలుజు పారడంతో గ్రామ మహిళలు గురువారం గంగదేవి పూజలు చేశారు. దీపాలను వెలిగించి చెరువు నీటిలో వదిలారు. పసుపు, కుంకుమ, పూలు వేసి హారతులు ఇచ్చారు. తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. పచ్చాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం మండలంలో పర్యటించనున్నారని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నూతనంగా నిర్మించిన కసిమ్మిట్ట సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పాల్గొన్న అంజూరు శ్రీనివాసులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీభోగేశ్వరాలయం ఆవరణలో శ్రీభోగేశ్వరీ ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. తొలుత ఆయన శ్రీభోగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో మునిరామయ్య కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. పేద కుటుంబానికి చెందిన మునిరామయ్య మృతి విషయాన్ని వైఎస్సార్ సీపీ తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి దహన క్రియలకు రూ.10వేలు పంపారు. పార్టీ నాయకులు కృష్ణమూర్తి, రమేష్ తదితరులు ఆగ్రామానికి వెళ్లి మృతుని భార్య మునెమ్మకు సాయం అందించారు.

ఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

నారాయణవనం: తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డిని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ప్రజాప్రతినిధులు గురువారం కలిసి సత్కరించారు. ద్వైవార్షిక తనిఖీల్లో భాగంగా నారాయణవనం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ఆయనను సుమన్‌కుమార్,సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మండల సమస్యలను, ప్రజల జీవన వృత్తులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

సచివాలయ సిబ్బందికి అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యత

సత్యవేడు: మండలంలోని 55 అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిమితమైన కార్యకలాపాలు నిర్వహించేందుకు సచివాలయ సిబ్బందిని తాత్కాలికంగా నియమించినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. అంగన్ వాడీ సిబ్బంది, హెల్పర్లు సమ్మె కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు మండల పరిధిలోని సచివాలయ సిబ్బందిలో 55 మందిని అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ విధులకు కేటాయించామని ఎంపీడీఓ తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

రేణిగుంట: అంగన్‌వాడీ సిబ్బంది డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని యూనియన్ అధ్యక్షురాలు ధనమ్మ కోరారు. రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రేణిగుంట, ఏర్పేడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం నిరసన దీక్ష చేపట్టారు. వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌ను రూ.5లక్షలకు పెంచాలన్నారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి

ఏర్పేడు: మహిళలు టైలరింగ్‌తో కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని జనశిక్షణ సంస్థ ప్రోగ్రాం అధికారి హరిబాబు అన్నారు. గురువారం పాపానాయుడుపేట రాస్ మహిళా భారతి కార్యాలయంలో పెన్నగడం, పెనుమల్లం గ్రామాల మహిళలకు టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ మూడు నెలలు ఉంటుందని తెలిపారు.

సరుకుల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి, రాజులపాలెం ఎస్టీ కాలనీల్లో గురువారం అమెజాన్, డొనేట్‌కార్డు, ఆషా సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తుపాన్ బాధిత 110 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, సర్పంచ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన





బీఎన్‌కండ్రిగ: కాంపాళ్లెంలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, వరదయ్యపాళెం: సిద్ధేశ్వరపురం వద్ద దెబ్బతిన్న వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- విలేజ్ క్లినిక్, ఆర్‌బీకే భవనాల ప్రారంభం

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. గురువారం మండలంలోని పల్లమాల గ్రామంలోని ఆర్‌బీకే, కాంపాళెం గ్రామంలో ఆర్‌బీకే, తలారివెట్టు గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతుల అవసరాలన్నీ గ్రామంలోనే లభిస్తున్నాయని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా పల్లె ముంగిటకే వైద్యం అందుతోందని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ క్లినిక్ భవనాల పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా భూముల రీసర్వే భూవివాదాలకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టవచ్చని తెలిపారు. రాష్ట్రంలో వంద సంవత్సరాల తర్వాత ప్రభుత్వం అతిపెద్ద భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. తద్వారా కచ్చితమైన కొలతలు తీసి హద్దులు నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అరణివిద్యానాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, మణినాయుడు, వైస్ ఎంపీపీ బాబు రెడ్డి, నాయకులు దేవదాసురెడ్డి, బాలగురవయ్య, నడిపయ్య, సిద్దేశ్వరి, నిరంజన్‌రెడ్డి, ఎంపీడీఓ సాయిలహరి, తహసీల్దార్ భార్గవి, పీఆర్ డీఈ మధుసూదన్‌రావు, సర్పంచ్‌లు రమణమ్మ, మాచాలమ్మ, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

వంటగది, తాగునీటి కొళాయిలు ప్రారంభం

మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడులో నిర్మించిన వంటగది, తాగునీటి కొళాయిలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న భోజన పదార్థాల రుచి చూశారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో భాగంగా మొదటి విడతలో ఎంపికైయిన పాఠశాల్లో అభివృద్ధి పనులు దాదాపు పూర్తి అవుతున్నాయని తెలిపారు. రెండవ విడత పనులు జరుగుతున్నాయన్నారు.

ఆడుదాం.. ఆంధ్రా పరికరాలు పంపిణీ

మండలంలోని కాంపాళెం ఆర్‌బీకే వద్ద ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పరికరాలను ఎమ్మెల్యే ఆదిమూలం క్రీడాకారులకు పంపిణీ చేశారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని, ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొని గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు.

వరదయ్యపాళెం మండలంలో సుడిగాలి పర్యటన

వరదయ్యపాళెం: మండలంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం సుడిగాలి పర్యటన చేశారు. పెద్ద పాండూరులో విశ్రాంత ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ పరంధామరెడ్డితో కలసి సిద్దేశ్వరపురం ఎగువ కాలువ వద్ద కోతకు గురైన వంతెనను పరిశీలించారు. ఆక్రమణల వల్లే వరద ఉధృతి తమ గిరిజనకాలనీ వైపు వస్తోందని వారు విన్నవించడంతో తక్షణమే ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ గౌరీశంకర్‌రావును ఆదేశించారు. పెద్ద పాండూరు సచివాలయానికి దారి ఏర్పాటు చేయాలని సూచించారు. కోతకు గురైన పెద్ద పాండూరు నుంచి తొండంబట్టుకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని డీఈలు ప్రభాకర్‌రెడ్డి, మధుసూదనరావును ఆదేశించారు. అంబికాపురం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద కోతకు గురైన ఆనకట్టను పరిశీలించి, వెంటనే మరమత్తులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన పనులను ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ శోభన్ యాదవ్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విపత్తు బాధితులకు ప్రభుత్వం అండ

వరదయ్యపాళెం: తుపాన్ కారణంగా ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలో కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరిన మరో 850 కుటుంబాలకు గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద రెండవ విడత ద్వారా రూ.16 లక్షల నగదు పంపిణీ చేశారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సర్పంచులు జ్యోతి, వీరభద్రం, దుడ్డు వేణు, అలీ, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, తహసీల్దార్ గౌరీశంకరరావు, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్రీడా కిట్లను అందజేశారు. మండల క్రీడా సాధికారత కో-ఆర్డినేటర్ బందిల కుమార్, పీడీ ముద్దుకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో అభిరామి పీఠాధిపతి



పూజల్లో పాల్గొన్న సురేష్ గురుకుల్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం తమిళనాడు రాష్ట్రం తిరుకడైయూర్ అభిరామి పీఠాధిపతి సురేష్ గురుకుల్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని బసవయ్యపాళెం భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో భారతి మాట్లాడుతూ సాధారణ పిల్లలతో సమానంగా ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించగలరని చెప్పారు. అందుకు వారికి తగిన శిక్షణ అందించడం ఒక్కటే మార్గమన్నారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలకు ట్యాబ్‌లు, వీల్‌చైర్లు పంపిణీ చేశారు. సహిత విద్య ఉపాధ్యాయులు నాగరాజు, చైతన్య, ఢిల్లీకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకల పునరుద్ధరణ



తాత్కాలిక కల్వర్టుపై వెళ్తున్న వాహనదారులు

వరదయ్యపాళెం: శ్రీకాళహస్తి-తడ ప్రధాన రోడ్డు మార్గంలో గురువారం రాత్రి నుంచి రాకపోకలను పునరుద్ధరించారు. వరదయ్యపాళెం సమీపంలోని ఎన్టీఆర్‌నగర్ వద్ద బుధవారం తెల్లవారుజామున కుంగిపోయిన కల్వర్టు ప్రాంతంలో తాత్కాలిక పనులు చేపట్టి వాహన రాకపోకలను యథావిధిగా పునరుద్ధించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసులు, ఏఈ గిరీష్ రెండు రోజుల పాటు అక్కడే ఉండి కాంట్రాక్టర్ ద్వారా తక్షణమే తాత్కాలిక పైపు కల్వర్టును నిర్మించారు. గురువారం రాత్రి 7గంటల నుంచి వాహన రాకపోకలను తాత్కాలిక కల్వర్టుపై అనుమతించారు.

17 నుంచి ధనుర్మాస పూజలు

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, అనుబంధ ఆలయాల్లో ఈనెల 17వ తేదీ నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం అవుతాయని ఆలయాల అధికారి నాగరాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం ధనుర్మాస ప్రారంభ గడియల్లో ప్రత్యేక గంట, వైద్య సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు. 18వ తేదీ సోమవారం నుంచి వేకువ జామునే సుప్రభాతానికి మారుగా తిరుప్పావై ప్రవచనాలతో ఆలయాలను తెరచి, శుద్ధి, తోమాల తదితర నిత్య కైంకర్యాల అనంతరం, ధనుర్మాస పూజలు నిర్వహిస్తారని తెలిపారు. కల్యాణ వెంకన్న ఆలయంతో పాటు అవనాక్షమ్మ, అగస్తీశ్వర, శక్తి వినాయక, పరాశురేశ్వర, వీరభద్రస్వామి ఆలయాలను వేకువ జామున తెరచి ధనుర్మాస పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆయన వివరించారు.

ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా



ఎండీపుత్తూరులో ర్యాలీ

ఏర్పేడు: గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికి తేసేందుకే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా నిర్వహించనుందని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. గురువారం మండలంలోని ఎండీపుత్తూరు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు





రేణిగుంట : గుత్తివారిపల్లెలో జెండా ఆవిష్కరణ, కేవీబీపురం : కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రేణిగుంట: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ అన్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ఆయ న పార్టీ నాయకులతో కలసి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా.. ఎన్నికల్లో ఇచ్చి న హామీల మేరకు అధికారం చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి జగనన్న పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. నవరత్న పథకాల ద్వారా నిరుపేద, అట్టడుగు వర్గాల ప్రజల జీవనప్రమాణాలను పెంచే దిశగా అడుగులు పడ్డాయని తెలిపారు. గత పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సులే శిరోధార్యమని, ప్రస్తుతం అర్హత ఉన్న వారికి తలుపుతట్టి మరీ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో గుత్తివారిపల్లె అభివృద్ధికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నిధులు కేటాయించారన్నారు. సంక్షేమ పథకాల కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, కార్యదర్శులు సుబ్బారెడ్డి, చంద్రిక, గిరిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వాణి, మునిరెడ్డి, చెంగల్రాయులు పాల్గొన్నారు.

సూరప్పకశంలో...:

మండలంలోని సూరప్పకశం సచివాలయ పరిధిలో గురువారం సాయంత్రం సర్పంచ్ సుధ ఆధ్వర్యంలో 'వై నీడ్ ఏపీ జగన్' కార్యక్రమం జరిగింది. తొలుత ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన బోర్డులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి నవరత్నాల ద్వారా లబ్ధి చేకూరిందని తెలిపారు. ఉప సర్పంచ్ చిత్ర, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



రేణిగుంట: మాట్లాడుతున్న సుధ

నవరత్నాలతో ఇంటింటా వెలుగులు

కేవీబీపురం: నవరత్న పథకాల లబ్ధితో ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాయని, భావి తరాల భవిష్యత్తు కోసం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రాష్ట్ర ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య అన్నారు. మండలంలోని పెరిందేశం సచివాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పెరిందేశం సచివాలయ పరిధిలో జరిగిన లబ్ధిని వివరించారు. పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగుర వేశారు. సర్పంచ్ మురగమ్మ, స్థానిక నాయకులు బత్తెయ్య, మాన్యం వెంకటేశ్వర్లు, సుబ్బరామనాయుడు, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మండల నాయకులు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, మాధవీరెడ్డి, డేవిడ్, ఎంపీడీఓ రామచంద్ర, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ప్రభుత్వం అండ



సత్యవేడు: ప్రభుత్వ సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: తుపాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. తుపాన్ కారణంగా మండల పరిధిలో 13 గ్రామాల్లో ఇళ్లల్లోకి నీరు చేరి అవస్థలు పడిన కుటుంబాలకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం అందజేసిన నిత్యావసరాలు, నగదు అందజేశారు. బియ్యం 25 కేజీలు, కేజీ కందిపప్పు, కేజీ నూనె అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసి తుపాను బాధితులను ఆదుకోవాలని కోరడంతో జిల్లాకు రూ.19కోట్లు మంజూరు చేశారన్నారు. మండల పరిధిలో 170 కుటుంబాలకు రూ. 3,81,500 ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బాధిత కుటుంబంలో ఒకరు ఉంటే రూ.1000, ఇద్దరు ఉంటే రూ. 2000, అతకంటే ఎక్కువ ఉన్న వారికి రూ.2500 వంతున పరిహారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సత్యవేడు పరిధిలో మదనంబేడు 12, దళవాయి అగ్రహారం 41, అరుంధతివాడ 8, ఏఎంపురం 3, రామచంద్రాపురం 10, ఇరుగుళం 11, మాదనపాళెం 5, చెరివి 07, కన్నావరం 25, వానెల్లూరు10, రాజగోపాలపురం 20, కొల్లడం 5, చెంగంబాకంలో 13 కుటుంబాలకు పరిహారం అందజేశామన్నారు. తహసీల్దార్ జరీనా మాట్లాడుతూ ఇళ్లు కూలిన వివరాలను ప్రభుత్వానికి నివేదించామని, బాధితులకు త్వరలో ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కె. చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మధుసూదన్ రాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు నీరు, నీడ, సౌకర్యాలతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశ హాల్‌లో ఉపాధి సిబ్బంది, మేట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలి వస్తుందని, రోజుకు 5 వేల మంది పనిచేయాలని, టార్గెట్ ప్రకారం పనుల్లో కూలీల సంఖ్య తగ్గకుండా చూడాలని తెలిపారు. ప్రతి పంచాయతీలో పండ్లతోటలు పెంపకం వైపు రైతులను ప్రోత్సహించి, దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఏపీఓ భానుప్రియ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ఎంవీఐ దామోదరనాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాయలసీమ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి దామోదరనాయుడు పాల్గొని మాట్లాడారు. అతివేగం, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం, కారులో వెళ్లే సమయంలో సీటు బెల్టు ధరించకపోవం, మద్యం సేవించి వాహనం నడపం కారణాలుగానే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

చైతన్య చిన్నపిల్లల ఆస్పత్రి ప్రారంభం



చైతన్యయాదవ్‌ను సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బత్తెనయ్యనాయుడు ఆస్పత్రి ఎదురుగా గురువారం చైతన్య ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఆస్పత్రి నిర్వాహకులను ఆయన సన్మానించారు. డాక్టర్ చైతనయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే బాల్య వివాహాల కట్టడి



ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: మహిళలు చైతన్య వంతులైనప్పుడే బాల్య వివాహాలను అరికట్టగలమని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బాల్య వివాహాలపై మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలను వివరించారు. ఈ సాంఘిక దురచారం రూపుమాపాలంటే మహిళల్లో చైతన్యం రావాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిళా డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర లెక్చరర్ శైలజ మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎలా నివారించాలో వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.